క్లుప్తంగా

ఏఎస్ఐ కుటుంబానికి చేయూత



నగరంపాలెం: తూర్పు సబ్ డివిజన్‌లోని లాలాపేట పోలీస్‌స్టేషన్ (పీఎస్) ఏఎస్ఐ బాలకృష్ణ గత నెల 23న అనారోగ్యంతో మృతి చెందారు. ఈ క్రమంలో చేయూత సహాయం కింద మంజూరైన లక్ష రూపాయల చెక్కుని బాలకృష్ణ భార్య భూలక్ష్మీకి శనివారం జిల్లా పోలీస్ కార్యాలయం (డీపీఓ)లో జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హాఫీజ్ అందించారు. అన్నివేళల్లో ఏఎస్ఐ కుటుంబానికి పోలీస్ శాఖ అండగా ఉంటుందని జిల్లా ఎస్పీ అన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీ డీఎస్పీ రత్నస్వామి, సీఐ ఎస్‌వీ.రాజశేఖర్‌రెడ్డి, గుంటూరు జిల్లా అసోసియేషన్ సభ్యులు రాజారావు, కరుణాకర్, రామకృష్ణ, హుస్సేన్, లక్ష్మణ్, కరిముల్లా పాల్గొన్నారు.

విలువైన సేవలు అందించిన శంకర సాయిబాబా



గుంటూరు ఎడ్యుకేషన్: సంస్కృత అధ్యాపకునిగా శంకర సాయిబాబా విలువైన సేవలు అందించారని జేకేసీ కళాశాల కరస్పాండెంట్ జాగర్లమూడి మురళీమోహన్ పేర్కొన్నారు. శనివారం జేకేసీ కళాశాలలో సంస్కృత అధ్యాపకుడు కప్పగంతు శంకర సాయిబాబా ఉద్యోగ విరమణ పొందిన సందర్భంగా ఆయనను కళాశాల యాజమాన్యం సన్మానించింది. కార్యక్రమంలో రాయపాటి సాంబశివరావు, రాయపాటి శ్రీనివాస్, జనచైతన్య హౌసింగ్ ప్రైవేటు లిమిటెడ్ డైరెక్టర్ మాదాల రత్నగిరిబాబు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ. నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



నగరంపాలెం: నాగార్జున సాంస్కృతి కేంద్రం / నాగార్జున మ్యూజిక్ కళాశాల సంయుక్తంగా శనివారం బ్రాడీపేట 2/14వ అడ్డరోడ్‌లో భావనచిన్న వజ్జల కుచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించారు. పద్మశ్రీ డాక్టర్ వై.నాయుడు, విజయవాడ డీసీపీ విశాల్‌గున్ని అతిథులుగా విచ్చేసి, నృత్య ప్రదర్శన చేసిన భావనచిన్నను అభినందించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు మస్తానయ్య జ్యోతి ప్రజ్వలనతో ప్రదర్శనను ప్రారంభించగా, కళాశాల అధ్యక్షులు డాక్టర్ ఎం.సత్యనారాయణ అధ్యక్షతన చేపట్టారు. కార్యక్రమంలో నాగార్జున కల్చర్ సెంటర్ కార్యదర్శి పీఎస్ఎన్.మూర్తి, సంగీత కళాశాల కార్యదర్శి డాక్టర్ ఎం.శ్రీధర్, డాక్టర్ కె.సూర్యనారాయణ పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న విశాలాంధ్ర పుస్తక ప్రదర్శన



నగరంపాలెం: విశాలాంధ్ర బుక్ హౌస్ ఆధ్వర్యంలో గుంటూరు లాడ్జి సెంటర్‌లోని ఏఎల్ బీఈడీ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన 23వ పుస్తక మహోత్సవం (పుస్తక ప్రదర్శన) ఈనెల ఏడో తేదీతో ముగియనుందని బుక్ హౌస్ మేనేజర్ ఎం.మల్లిఖార్జునరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పుస్తక ప్రియులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ క్రమంలో శనివారం రాత్రి వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్ పుస్తక ప్రదర్శనను సందర్శించారు. ప్రదర్శనలో నెలకొల్పిన పలువురు రచయితల పుస్తకాలను ఆయన తిలకించారు.

పేకాట రాయుళ్లు అరెస్టు

పట్నంబజారు: పేకాట ఆడుతున్న వారిని పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. లాలాపేట పోలీసుల కథనం ప్రకారం ఐపీడీ కాలనీలోని శ్మశానం వద్ద ఎనిమిది మంది పేకాట ఆడుతున్న క్రమంలో ఎస్ఈబీ పోలీసులు అదుపులోకి తీసుకు న్నారు. వారి నుంచి రూ. 4,960లు స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు ఎనిమిది మందిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరుస్తున్నట్లు తెలిపారు.

అవ్వాతాతలకు పింఛన్ పండుగ

- దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా రూ.3 వేలు పింఛన్ అందజేత
- గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో 60,436 మంది లబ్ధిదారులకు రూ.18.23 కోట్లు విడుదల
- అర్హతే ప్రామాణికంగా వార్డు సచివాలయాల ద్వారా పింఛన్ మంజూరు
- పండుగ వాతావరణంలో పెరిగిన పింఛన్ల పంపిణీ చేస్తున్న వలంటీర్లు



క్రిస్టియన్ పేటలో నారాయణమ్మకు రూ.3వేలు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ ఇస్హాక్

నెహ్రూనగర్: దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా వైఎస్సార్ పెన్షన్ కానుక ద్వారా అవ్వ,తాతలకు రూ.3వేలు పింఛన్ అందిస్తూ వారికి నేనున్నా అంటూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గొప్ప భరోసా కల్పిస్తున్నారు. వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తన సుదీర్ఘ పాదయాత్రలో పేదల సమస్యలను అతి దగ్గరగా గుర్తించి, అధికారంలోకి వచ్చిన వెంటనే నవరత్నాల పథకాలు అమలు చేస్తూ దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నారు. గతంలో రూ.2 వేలు ఉన్న పింఛన్‌ను రూ.3వేలు దాకా పెంచుకుంటూ పోతామని చెప్పిన విధంగా నూతన సంవత్సరంలో లబ్ధిదారులకు రూ.3 వేలు పింఛన్‌ను అందజేస్తూ మాట తప్పని, మడమ తిప్పని నేతగా పేద ప్రజల గుండెల్లో నిలిచిపోయారని పలువురు తమ అభిప్రాయాలను వ్యక్త పరుస్తున్నారు.

గుంటూరులో 60,436 మంది..

గుంటూరు నగరంలో 60,436 మంది పెన్షన్ లబ్ధిదారులు ఉన్నారు. వీటిలో పశ్చిమ నియోజకవర్గంలో 22,798 మంది ఉన్నారు. తూర్పు నియోజకవర్గంలో 25,645, ప్రత్తిపాడు (10 విలీన గ్రామాలు) 11,188 మంది లబ్ధిదారులుగా ఉన్నారు. వీరందరికి రూ.18.23 కోట్లు ప్రభుత్వం విడుదల చేసింది. ఒక్క జనవరిలోనే 805 మందికి నూతన పింఛన్లు మంజూరయ్యాయి. ఈ నెల 3 నుంచి వలంటీర్లు లబ్ధిదారుల ఇంటింటికి పింఛన్లు అందజేయనున్నారు.

గతంలో గంటల తరబడి క్యూలో...



గతంలో పింఛన్ తీసుకోవాలంటే గంటల తరబడి పనులు మానుకొని క్యూలో ఉండేవాళ్లం. కాని నేడు వలంటీర్ మా ఇంటి దగ్గరకే వచ్చి పింఛన్ ఇచ్చి, ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా అని కుటుంబ సభ్యుల వలే అండగా ఉంటున్నారు.

– షేక్ దస్తాబి, వితంతు పింఛన్, శ్రీనివాసరావుతోట

ఠంచన్‌గా పింఛన్



సీఎంవైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత ప్రస్తుతం ఉన్న పింఛన్లు రూ.2 వేల నుంచి 3 వేలకు పెంచడం సంతోషంగా ఉంది. ప్రతి నెల మా వలంటీర్ ఠంచన్‌గా ఇంటికి వచ్చి పింఛన్ ఇస్తున్నారు. ప్రస్తుతం జగన్ ఇస్తున్న రూ.3 వేలతో ఎవరి మీద ఆధారపడకుండా పింఛన్ డబ్బుతో హాయిగా ఉన్నాం.

–పొట్లూరి సరోజిని, వృద్ధాప్య పింఛన్, పెదపలకలూరు

కొండంత భరోసా



సచివాలయ వ్యవస్థ అందు బాటులోకి వచ్చిన తరువాత ప్రభుత్వ పథకాల సమాచారం. దరఖాస్తులు తేలికగా అందుతున్నాయి. మా వలంటీర్ మా ఇంటి వద్దకే వచ్చి అన్ని వివరాలు ఎటువంటి విసుగు లేకుండా చెబుతున్నాడు. రూ.3 వేలకు పెంచడం ద్వారా నాకు కొండంత భరోసా కల్పించిన సీఎం వైఎస్ జగన్‌కు రుణపడి ఉంటా.

– తాళ్లూరి సాంబయ్య, కొరిటెపాడు

●ఆనందమనిపించెన్



ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పింఛన్ పెంపు చేసిన నేపథ్యంలో ఫించన్ లబ్ధిదారులు, వైఎస్సార్ సీపీ నేతలు ఆయన చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని 29వ డివిజన్ ఏటీ అగ్రహారంలో పార్టీ క్లస్టర్- 2 అధ్యక్షుడు నూనె ఉమామహేశ్వరరెడ్డి, కార్పొరేటర్ రోషన్ ఆధ్వర్యంలో ఫించన్లు అందజేయడంతో పాటు సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. -పట్నంబజారు

25 నుంచి త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు



బ్రోచర్‌ను ఆవిష్కరించిన కిషోర్, గిరిజాశంకర్, నేతి విశ్వేశ్వరరావు

పాత గుంటూరు: లక్ష్మీపురంలోని త్యాగరాజస్వామి మందిరం వేదికగా ఈ నెల 25వ తేదీ నుంచి 31 వరకు స్వామివారి ఆరాధన ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు త్యాగరాజ సాంస్కృతిక సంఘం కార్యదర్శి వల్లూరి కృష్ణ కిషోర్ తెలిపారు. శనివారం మందిరంలో విలేకరుల సమావేశంలో కిషోర్ మాట్లాడుతూ రోజు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కళాకారులచే ప్రధాన కచేరీలు జరుగుతాయన్నారు. 25న ఎ.ఎస్.మురళి, గాత్ర కచేరి, 26న బెంగళూరు బ్రదర్స్ గాత్ర కచేరి, 27న మోదుమూడి సుధాకర్ గాత్రకచేరి, 28న తులసి విశ్వనాథ్ గాత్ర కచేరి, 29 సోమవారం శాంతల సుబ్రహ్మణ్యం, గాత్ర కచేరి, 30న ఎం.పావని, లావణ్య, వి. సుదర్శన్, కచేరీలు, 31న ఉదయం ఊరేగింపు, పంచరత్న సేవ, సాయంత్రం 'నౌకా చరితం నృత్యరూపకం నాట్యాచార్య బి. సురేష్ బాబు వారి శిష్యబృందం నిర్వహిస్తారని తెలిపారు. సంగీతాభిమానులు, కళాకారులు పాల్గొనాలని కోరారు. సమావేశంలో సంస్థ ఉపాధ్యక్షులు ఎస్. గిరిజాశంకర్, సలహాదారులు నేతి విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సమాచార సేకరణ, భావ వ్యక్తీకరణ కీలకం

కేంద్ర పొగాకు పరిశోధన సంస్థ శాస్త్రవేత్త రవిశంకర్



శాస్త్రవేత్త రవిశంకర్‌ను సత్కరిస్తున్న ఎస్వీ రమణ, సుబ్బారావు, శ్రీనాథ్ మిత్ర, లక్ష్మీనారాయణ

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులకు సమాచార సేకరణ, భావ వ్యక్తీకరణ నైపుణ్యాలు కీలకమని రాజమహేంద్రవరంలోని కేంద్ర పొగాకు పరిశోధన సంస్థ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సీహెచ్ రవిశంకర్ పేర్కొన్నారు. అమరావతిరోడ్డులోని హిందూ కళాశాల పీజీ కోర్సుల విభాగంలో శనివారం ఎంసీఏ ప్రథమ సంవత్సర విద్యార్థులకు ఇండక్షన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రవి శంకర్ కార్పొరేట్ ప్రపంచంలో కృత్రిమ మేధస్సు పాత్ర అనే అంశంపై మాట్లాడుతూ చదువుతో పాటు భావ వ్యక్తీకరణ నైపుణ్యం ఎంతో కీలకమని, భావ వ్యక్తీకరణ లేనిచో పనిచేసే ప్రదేశంలో రాణించలేరని స్పష్టం చేశారు. యూఎస్ఏకు చెందిన సీనియర్ ఇంజినీరింగ్ మేనేజర్ శ్రీనాథ్ మిత్ర సింగం మాట్లాడుతూ కంప్యూటర్ అప్లికేషన్స్‌లో మాస్టర్స్ చదువుతున్న విద్యార్థులు ప్రధానంగా సంబంధిత సబ్జెక్టుల్లో పరిజ్ఞానంతో పాటు నైపుణ్యాలను అభివృద్ధి పరచుకుని, ఇంటర్వ్యూలో విజయం సాధించాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ మాట్లాడుతూ ఇండక్షన్ ప్రోగ్రామ్‌ను పరిశ్రమలకు విద్యార్థులను అనుసంధానం చేసే విధంగా చేస్తున్న చిరు ప్రయత్నమని వివరించారు.

హిందూ కళాశాల కమిటీ ఉపాధ్యక్షుడు ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ విద్యాసంవత్సరాన్ని ప్రారంభించడమే కాకుండా సంపూర్ణ విద్యాబోధనపై నిబద్ధతను చాటుతుందన్నారు. కార్యక్రమంలో హిందూ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ సుబ్బారావు, సహాయాచార్యులు డాక్టర్ ఈశ్వర్ ప్రసాద్, అభిష షర్లీ, నాగుల్ మీరావలి, విద్యార్థులు పాల్గొన్నారు.

టూ డిపో ఆర్టీసీ సిబ్బందికి బహుమతులు



పాత గుంటూరు: నెల్లూరు జోన్ పరిధిలోని డిపోలలో రూ.16 లక్షలు అత్యధిక ఆదాయం సాధించిన గుంటూరు–2 డిపో డ్రైవర్లు, కండక్టర్లకు శనివారం జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం. రవికాంత్ బహుమతులు అందజేసి ప్రశంసించారు. గుంటూరు– 2 డిపో గ్యారేజీలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. డిపో మేనేజర్ షేక్ అబ్దుల్ సలామ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా రవికాంత్ పాల్గొని మాట్లాడారు. బస్సుల నిర్వహణలో చిత్తశుద్ధితో పని చేయాలని గ్యారేజి సిబ్బందికి సూచించారు. సంక్రాంతి, మహాశివరాత్రి పండుగ సమయాల్లో ప్రయాణీకులకు రద్దీ అనుగుణముగా శుభ్రమైన, కండీషన్ బస్సులను అందుబాటులో ఉంచాలని తెలిపారు. నెల్లూరు జోన్ డెప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీరు నర్రా శ్రీనివాసరావు మాట్లాడుతూ బస్సుల కండీషను మెరుగు పరిచే విధముగా బ్రేక్ డౌన్ లేకుండా బస్సుల నిర్వహణ చేయాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

భాష్యం విద్యాసంస్థల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలు



సంక్రాంతి సంబరాల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులతో భాష్యం రామకృష్ణ

గుంటూరు ఎడ్యుకేషన్: తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను సంక్రాంతి పండుగ ప్రతిబింబిస్తుందని భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ అన్నారు. శనివారం చంద్రమౌళి నగర్‌లోని భాష్యం మెయిన్ క్యాంపస్‌లో ముందస్తు సంక్రాంతి సంబరాలను జరుపుకున్నారు. ఈసందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న రామకృష్ణ మాట్లాడుతూ చిన్ననాటి నుంచే విద్యార్థులకు మన తెలుగు సంస్కృతి, కట్టుబొట్టు గురించి నేర్పించడం ద్వారా వారిలో ఉత్తమమైన విలువలు పెంపొందించబడతాయన్నారు. ఆ దిశగా భాష్యం ఎప్పుడూ కృషి చేస్తూనే ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఆయన చిన్నారులకు భోగి పళ్లు పోసి వారిని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా భోగి మంట వేసి సంక్రాంతి విశిష్టతను విద్యార్థులకు వివరించారు. సంక్రాంతి తెలుగుదనం ఉట్టిపడేలా చిన్నారులు హరిదాసుల వేషధారణలో కనువిందు చేశారు. క్యాంపస్ ప్రాంగణాన్ని అందమైన రంగవల్లులతో తీర్చిదిద్దారు. విద్యార్థుల తల్లిదండ్రులకు నిర్వహించిన ముగ్గుల పోటీలు ఆహ్లాదంగా సాగాయి. కార్యక్రమంలో క్యాంపస్ ప్రిన్సిపాల్ కృష్ణ కిషోర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గత ప్రభుత్వాలు సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించాయి

సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా

పట్నంబజారు: గత ప్రభుత్వాలు ప్రజలకు సంక్షేమాన్ని అందజేయటంలో పూర్తి వైఫల్యం చెందాయని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా విమర్శించారు. శనివారం నియోజకవర్గ పరిధిలోని మూడోవ డివిజన్ కార్పొరేటర్ పోలవరపు జ్యోతి ఆధ్వర్యంలో వైఎస్సార్ ఫించన్ పెంపు కార్యక్రమంలో పాల్గొన్నారు. యాదవులబజారు కృష్ణుడి కల్యాణ మండపంలో అర్హులైన వారికి ఫించన్ అందజేశారు. ఈ సందర్భంగా నూరిఫాతిమా మాట్లాడుతూ గత ప్రభుత్వాలు పేదలకు మొండిచేయి చూపెట్టాయని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి నిరుపేదలకు సంక్షేమాన్ని చేరువ చేశారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు వెంకటేశ్వరరావు, ఆంజనేయులు, మాధవరావు, బాబు, తోట మణికంత, తదితరులు పాల్గొన్నారు. డీఎస్ నగర్, ఏటుకూరు రోడ్డులోని పీకలవాగును పరిశీలించారు.

ప్రభుత్వ అనుమతి అవసరం

ఏఎన్‌యూ: ఎమ్మార్పీఎస్ (మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి), ఎంఎస్ఎఫ్(మాదిగ స్టూడెంట్స్ ఫెడరేషన్) నాయకులు శనివారం ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ప్రధాన ద్వారం ఎదుట ధర్నా చేశారు. యూనివర్సిటీలో శనివారం ఎంఎస్ఎఫ్ జాతీయ సదస్సు నిర్వహించుకునేందుకు అనుమతి ఇవ్వాలని కొద్ది రోజులక్రితం ఎంఎస్ఎఫ్ నాయకులు ఏఎన్‌యూ వీసీ ఆచార్య పి.రాజశేఖర్‌ను కోరారు. యూనివర్సిటీలో ఏ విద్యార్థి సంఘాల సమావేశాలకు అనుమతి లేదని, ప్రభుత్వం నుంచి అనుమతి తెచ్చుకుంటే నిర్వహించుకోవడానికి అభ్యంతరం లేదని వీసీ వారికి తెలిపారు. దీనికి నిరసనగా ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ నాయకులు ధర్నాకు దిగారు. అనంతరం ఎంఎస్ఎఫ్ జాతీయ మహాసభకు అనుమతి ఇవ్వాలని కోరుతూ వీసీకి వినతి పత్రం సమర్పించి వెనుదిరిగారు. యూనివర్సిటీ వద్ద భారీగా పోలీసు బలగాలను మోహరించారు.

జీజీహెచ్‌కు విలువైన వస్తువుల వితరణ



వితరణగా అందజేసిన వస్తువులను అందజేస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో పనిచేస్తున్న నాల్గో తరగతి ఉద్యోగులు, నర్సింగ్ సిబ్బంది, పారా మెడికల్ సిబ్బంది, వైద్యులు ఆసుపత్రి అభివృద్ధి కోసం మానవత్వంతో రూ. 6 లక్షల విలువ గల వస్తువులను అందచేసినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ తెలిపారు. శనివారం సూపరింటెండెంట్ చాంబర్‌లో నూతన సంవత్సరం సందర్భంగా పలువురు దాతలు అందచేసిన వివిధ వస్తువులను ఆయా విభాగాలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ నూతన సంవత్సరం పురస్కరించుకుని ప్రతి ఒక్కరు ఆసుపత్రికి ఉపయోగపడే వస్తువులను అందించాలని తాను ఇచ్చిన పిలుపు మేరకు వస్తువులను అందచేసిన అందరికీ కృతజ్ఞలు తెలిపారు. ఆసుపత్రికి ఆరు నెలల వరకు ఉపయోగపడే స్టేషనరీ ఇవ్వడం అభినందనీయమన్నారు. రోగులకు మెరుగైన వైద్యం అందించడానికి ప్రతిఒక్కరూ తమవంతు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఆసుపత్రికి రోజుకు నాలుగు వేల మందికి పైగా రోగులు వస్తున్నారని, అందులో రెండు వేలకు పైగా రోగులు ఇన్ పేషంట్స్‌గా వార్డులో చేరుతున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వం ఆసుపత్రి అభివృద్ధి కోసం అన్ని విధాలా కృషి చేస్తోందన్నారు. అందులో భాగంగా వందల పోస్టులను భర్తీ చేస్తుందన్నారు. నగరంలోని ఉదయ్ ఆసుపత్రి అధిపతి బ్లడ్ బ్యాంక్ కు అవసరమైన రూ. 1.80 లక్షల విలువగల పరికరాలను అందచేసినట్లు చెప్పారు. జూనియర్ డాక్టర్లు, నర్సింగ్ సిబ్బంది, జనరిక్ మందుల షాపు నిర్వాహకులు ముందుకు వచ్చి అధిక మొత్తంలో పరికరాలను అందచేశారన్నారు.

కార్యక్రమంలో డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ డి.ఎస్.ఎస్.శ్రీనివాస ప్రసాద్, సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకట సతీష్ కుమార్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుధాకర్ రెడ్డి, నర్సింగ్ సూపరింటెండెంట్ కె.ఆశ రోజని, అడ్మినిస్ట్రేటర్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

మ్యాక్సివిజన్ సూపర్ స్పెషాలిటీ నేత్ర వైద్యశాల ప్రారంభం



గుంటూరు మెడికల్: మ్యాక్సివిజన్ సూపర్ స్పెషాలిటీ నేత్ర వైద్యశాల వారి 46వ బ్రాంచ్ హాస్పటల్‌ను శనివారం గుంటూరులోని పట్టాభిపురంలో ప్రారంభించారు. ప్రముఖ కంటి వైద్య నిపుణులు డాక్టర్ ఎ.వి.వి.రామలింగారెడ్డి భాగస్వామ్యంతో నూతన బ్రాంచ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మ్యాక్సివిజన్ సూపర్ స్పెషాలిటీ నేత్ర వైద్యశాలల చైర్మన్ డాక్టర్ జి.ఎస్.కె.వేలు మాట్లాడుతూ ఆధునిక నేత్ర చికిత్సా సేవలు గుంటూరు ప్రజలకు అందించేందుకు నూతన బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్ అంతటా తమ ఆసుపత్రి శాఖలు ఉన్నాయన్నారు. అన్ని వర్గాలకు సూపర్ స్పెషాలిటీ కంటి వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా తాము అన్ని చోట్ల శాఖలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. మ్యాక్సివిజన్ నేత్ర వైద్యశాల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎ.వి.వి.రామలింగా రెడ్డి మాట్లాడుతూ కంటి శుక్లాలు, గ్లకోమా, కార్నియా, పిల్లల నేత్ర సంబంధిత చికిత్సలు, వాక్యూలోప్లాస్టి ఆపరేషన్లు, తమ ఆసుపత్రిలో అందుబాటులో ఉన్నట్లు వెల్లడించారు.

ఉద్యమాల పితామహుడు మార్పు బాలకృష్ణమ్మ



మార్పు బాలకృష్ణమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉద్యమాల పితామహుడు మార్పు బాలకృష్ణమ్మ చిరస్మరణీయుడని ఏపీటీఎఫ్ (1938) జిల్లా అధ్యక్షుడు గోవిందు వేళాంగిణి రాజు తెలిపారు. శనివారం నగరంపాలెంలోని ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఉపాధ్యాయ ఉద్యమనేత, మాజీ ఎమ్మెల్సీ మార్పు బాలకృష్ణమ్మ 11వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వేళాంగిణి రాజు మాట్లాడుతూ ఉపాధ్యాయ హక్కుల సాధన, ఆర్థిక పరమైన అంశాల కల్పనలో చేసిన కృషి, పోరాట పటిమను వివరించారు. కౌన్సెలింగ్ పద్ధతిలో ఉపాధ్యాయ బదిలీలతో పాటు 010 పద్దు ద్వారా వేతనాలు చెల్లించే విధానాన్ని సాధించారని గుర్తు చేశారు. సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సుబ్బారావు మాట్లాడుతూ కేంద్ర ఉద్యోగుతో పాటు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ, గ్రాట్యూటీ, పెన్షన్‌తో పాటు మెరుగైన వేతన సవరణ సాధించడంలో ఆయన విశేష కృషి చేశారని వివరించారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె. నరసింహారావు, రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ విజయానంద్, నాయకులు వై. నాగమల్లేశ్వరరావు, జె.సాయి మల్లిఖార్జునరావు, ఎ. జోజప్ప, కె.కైలాస్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

[illegible]

వి. నాగేశ్వరరావు, అడ్వకేట్
నగరంపాలెం, గుంటూరు. సెల్: 9032061847

నాల్గో రోజు బీజేపీ విజయ సంకల్ప యాత్ర



స్థానికులతో మాట్లాడుతున్న జయప్రకాష్ నారాయణ, బీజేపీ నేతలు

గుంటూరు మెడికల్: బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, పశ్చిమ నియోజకవర్గం కన్వీనర్ వల్లూరు జయప్రకాష్ నారాయణ ఆధ్వర్యంలో జరుగుతున్న బీజేపీ విజయ సంకల్పయాత్ర శనివారానికి నాల్గో రోజుకు చేరుకుంది. ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డాక్టర్ శనక్కాయల అరుణ యాత్రను ప్రారంభించారు. స్థానిక మల్లికార్జున పేట శివాలయం వద్ద ప్రారంభమై పొట్టి శ్రీరాములు నగర్, అరండల్ పేట 10వలైను వరకు యాత్ర కొనసాగింది. డాక్టర్ అరుణ, జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ బీజేపీ చేపట్టిన విజయ సంకల్ప యాత్రకు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోందన్నారు. కార్యక్రమంలో పెద్దింటి కృష్ణ చైతన్య, మంత్రి సుగుణ, రమాదేవి, శ్రీకల్యాణి, బజరంగ్ రామకృష్ణ, వెలగలేటి గంగాధర్, పాలపాటి రవికుమార్, చెరుకూరి తిరుపతిరావు పాల్గొన్నారు.

పౌరాణిక కళాకారుల సంఘం వార్షికోత్సవాలు ప్రారంభం



కళాకారులను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి

పాత గుంటూరు: స్థానిక వెంకటేశ్వర విజ్ఞానమందిరం వేదికగా పౌరాణిక కళాకారుల సాంస్కృతిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు నలక శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సంఘం 27వ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. డాక్టర్ ఏం. ఫర్నికుమార్ మధుర సినీ గీతాలాపనతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమాలను సంస్థ అధ్యక్షుడు చెన్నుపాటి కృష్ణారావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి సనిశెట్టి సాంబశివరావు, తన్నీరు దనారావు, బండి శ్రీకాంత్, మురుగు సూరినారాయణ, తన్నీరు రమణ, తోట శ్రీనివాసరావు తదితరులు పర్యవేక్షించారు.